క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం మూల నక్షత్రం, చవితి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకిసేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యద్దనపూడి: అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పర్చూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సూరవరపుపల్లి కేంద్రంలో టీచర్ పోస్టులకు బీసీ–బీ, గన్నవరం ఎస్సీ కాలనీలో టీచర్ పోస్టుకు ఎస్సీ, యద్దనపూడి బీసీ కాలనీలో ఆయా పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు 15వ తేదీ సాయత్రం 5 గంటల్లోపు పర్చూరు ఐసీడీఎస్ కార్యాలయంలో స్వయంగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు పర్చూరు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రేపు కోఆపరేటివ్ సొసైటీ మహాజన సభ

చినగంజాం: మండలంలోని చినగంజాం గ్రామం చినగంజాం కోఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ రద్దు చేసే క్రమంలో ఈ నెల 10 వతేదీ బుధవారం ఉదయం 11 గంటలకు చినగంజాం గ్రామ సచివాలయ ఆవరణలో మహాజన సభ నిర్వహించనున్నట్లు సొసైటీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ నూతలపాటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ నందు సంఘం లావాదేవీలు పరిశీలించి, సంఘ రిజిస్ట్రేషన్ రద్దు చేసే అంశంపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు, సంఘ సభ్యులు సభకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

14న పూనూరులో లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం 14వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు, అష్టోత్తరశతనామావళి పూజా కార్యక్రమాలు, పాలపొంగళ్ల నివేదన కార్యక్రమం సాయత్రం 7 గంటలకు జోలకల్లు భజనా బృందం వారిచే భజనా కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



ఇంటింటా వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: వైద్యం చేయించుకోలేని గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రాం ఒక వరమని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్, పీ భారతి అన్నారు. సోమవారం చెన్నుపల్లి, కొత్తూరు గ్రామాల్లో 104 వాహనం ద్వారా ఉచిత వైద్య శిబిరాల్లో భాగంగా బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. సాయంత్రం ఇంటింటికి వెళ్లి వృద్ధులను పరీక్షించారు. కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

చీరాల: చీరాల మండలం దేవినూతల గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఈపూరుపాలెం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్ దాడి చేసి మద్యం అమ్ముతున్న మల్లవరపు వెంకట శివయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 క్వార్టర్ సీసాలు, పది బీర్లు, రెండు 750 ఎంఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వం లక్ష్యం

- నూతన తారు రోడ్డును ప్రారంభించిన కృష్ణచైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య



తారు రోడ్డును ప్రారంభిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య, గరటయ్య

జె.పంగులూరు: సంక్షేమం, అభివృద్ధి సమాన లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కృష్ణచైతన్య పేర్కొన్నారు. మండల పరిధిలోని రేణింగవరం నుంచి పంగులూరు వరకు గ్రామీణ సడక్ యోజన కింద రూ. 7.21 కోట్ల వ్యయంతో 10 కిలో మీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం చేశారు. సోమవారం నూతనంగా నిర్మించిన తారు రోడ్డును ఆయన, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాచిన చెంచుగరటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన గ్రామీణ లింక్ రోడ్డు వలన రేణింగవరం, కొండమూరు, జనకవరం, పంగులూరు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగం అన్నారు. ఈ నాలుగు గ్రామాల ప్రజలు అద్దంకి వెళ్లడానికి ఈ రోడ్డు ప్రయాణం ఎంతో అనువుగా ఉంటుందని తెలిపారు. రైతులు పండించిన పంటను తీసుకురావటానికి వీలుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకట సుబ్బారావు, రేణింగవరం గ్రామ సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, కొండమూరు గ్రామ సర్పంచ్ బండి బండి శివకుమారి, జనకవరం సర్పంచ్ తల్లపనేని వీరమ్మ, పంగులూరు సర్పంచ్ గుడిపూడి నాగేంద్ర రామారావు, కోప్షన్ సభ్యులు ఖాశీమ్‌ఖాన్, ఎంపీటీసీ సింధూర అజీల్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలన్ని మహిళల అర్థికాభివృద్ధికే..

జగనన్న ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఎక్కువ పథకాలు మహిళల ఆర్థికాభివృద్ధి చేందెందుకే కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని వెలుగు కార్యలయంలో వీవోఏలు, సీసీలకు ఏపీఎం జ్యోతుల ప్రసాద్‌బాబు అధ్వర్యంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా కృష్ణచైతన్య, గరటయ్య పాల్గొన్నారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలు అన్ని లబ్ధిదారులకు అందేలా వీవోఏలు చూడాలన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు సంబంధించిన సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏసీ కాకి రవికుమార్, ఎల్‌సీ విజయ భాస్కరావు, మండల అధ్యక్షురాలు పూసల గాయత్రి, సీసీలు కామేశ్వరావు, దాసు, నరసింహరావు, వీవోలులు పాల్గొన్నారు.

మిరప రైతులు జాగ్రత్తలు పాటించాలి



పూసపాడులో మిరప పంటలను పరిశీలిస్తున్న అధికారులు



కేశవరప్పాడులో మిరపను పరిశీలిస్తున్న తహసీల్దారు, హెచ్‌ఓలు

కారంచేడు/చినగంజాం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మిరప పంటల జాగ్రత్త కోసం రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దారు ఎస్ వెంకటరత్నం అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కారంచేడు, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, తిమిడెదపాడు, ఆదిపూడి గ్రామాల్లో హార్టికల్చర్ ఆఫీసర్ అలేఖ్యతో కలసి కల్లాల్లో ఉన్న మిరపను పరిశీలించారు. ఆరబెట్టుకొనే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు రైతులకు వివరించారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని, అసరమైతే రైతులను రాష్ట ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వం నుంచి రాయితీలో టార్పాలిన్ పట్టలు అందించాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన తహసీల్దారు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పట్టలను రాయితీపై పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రాంబాబు, హార్టికల్చర్ సిబ్బంది, ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూసపాడులో..

వర్షాల కారణంగా తడిసిన మిరప పంటను రక్షించుకునేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు.

సోమవారం మండలంలోని పూసపాడు రెవెన్యూ పరిధిలోని పూసపాడు గ్రామంలో కల్లాల్లో మిరప కాయలను పరిశీలించేందుకు తహసీల్దార్ పీ బ్రహ్మయ్య, మండల వ్యవసాయాధికారి పి వేణుగోపాల్, ఉద్యాన వన శాఖాధికారి డీ రవిప్రకాష్‌లు పర్యటించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ కిషోర్, వీఏఏ అలెగ్జాండర్ , రెవెన్యూ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి ఆత్మీయ సత్కారం

చీరాల రూరల్: చీరాల సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా న్యాయమూర్తి సుధ వారం రోజులు క్రితం విధులు చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు ఆహ్వాన సభ ఏర్పాటుచేసి న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. చీరాల కోర్టులో న్యాయవాదులు ఎంతో సౌమ్యులని, ఎటువంటి వివాదాలు పెట్టుకోరని చెప్పారు. మూడేళ్లపాటు సబ్‌కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తించి బదిలిపై వెళ్లిన న్యాయమూర్తి ఎం. శుభవాణి చక్కగా పనిచేసి కక్షిదారులకు సముచితమైన న్యాయసహాయం అందచేశారన్నారు. న్యాయవాదుల మన్ననలు పొంది బదిలీపై వెళ్లారని, అలానే ప్రస్తుతం సీనియర్ సివిల్ జడ్జిగా విధులు చేపట్టిన న్యాయమూర్తి సుధ అంతకంటే ఎక్కువగా న్యాయవాదుల అభిమానం పొందుకోవాలని సూచించారు. అలానే దీర్ఘకాలంగా కోర్టులలో పెండింగులో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి న్యాయమూర్తికి తమ సహకారాలను అందిస్తామని న్యాయవాదులు న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. తదనంతరం సుధకు శాలువాలువేసి పూల బొకేలు అందజేసి ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొరవ రమేష్‌బాబు అధ్యక్షత వహించిన సత్కార సభలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కటకం చంద్రశేఖర్, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రతినిధులు మేరుగ రవి కుమార్, షేక్ సిరాజ్, నాశన రాము, పరశబోయిన తులసీరామ్, మహిళా న్యాయవాద ప్రతినిధి ఎ. మణినాగ శయన, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్మాలపాడులో నగదు చోరీ

అద్దంకి: దొంగలు మితిమీరిపోయారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు చొరబడి నగదు చోరీ చేశారు. ఈఘటన సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో జరిగింది. సోమవారం ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జాన్‌బాషా ఆదివారం రాత్రి తన ఇంటిలోని టేబుల్ డ్రాయర్‌లో రూ.2.40 లక్షలు నగదుపెట్టి నిద్రపోతున్నాడు. అర్ధరాత్రి 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వెనుక ఉన్న తలుపు తెరచి ఇంట్లోకి ప్రవేశించి నగదును అపహరించుకు పోయారు. జాన్‌బాషా ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పది విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీపీ యలమంద

అద్దంకి: ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం సంతమాగులూరు ఎంపీపీ యలమంద అభినందనలు తెలిపి సత్కరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు ఫస్ట్, ప్రభుత్వ ఉపాధ్యాయులే ది బెస్ట్ నినాదాలతో విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వేమవరపు కోటేశ్వరరావు, వెల్లలచెరువు, కుందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం జీ వెంకటేశ్వర్లు, ఆనంద్, ఉపాధ్యాయ సంఘాల నాయకుడు వలిఖాన్, శేఖర్ ముస్తాఫ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాలతో నేరాలకు చెక్

- పోలీసు శాఖ ఆధ్వర్యంలో కెమెరాల ఏర్పాటు
- దాతల సహకారంతో ఆరు గ్రామాల్లో 24 కెమెరాలు
- మానిటరింగ్ సిస్టం, వైర్‌లెస్ సెట్లు
- దశల వారీగా అన్నీ గ్రామాల్లో ఏర్పాటు



ఏర్పాటు చేసిన కెమెరాలు



చెన్నుపల్లిలో కెమెరాలు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



బల్లికురవలో మానిటరింగ్ సిస్టం

బల్లికురవ: పోలీసులు నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. నిత్యం ఏదో ఒకచోట ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పోలీసులు వారి ఆట కట్టించడానికి నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాలను నిఘా రక్షణలో ఉంచేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆరు ప్రధాన గ్రామాల్లో 24 సీసీ కెమెరాలు మానిటరిగ్, వైర్‌లెస్ సెట్లను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో కొత్త వ్యక్తులు గ్రామాల్లో తిరగకుండా హత్యలు జరగకుండా దొంగతనాలు, దోపిడీలు, చోరీలకు కొంత మేర అడ్డుకట్ట పడింది. మండలంలోని మిగిలిన ప్రధాన గ్రామాల్లో దశల వారీగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఎస్సై వీ. వేమన సమాయత్తమౌతున్నారు. గ్రామ పంచాయతీ, సచివాలయాల్లో మానిటరింగ్ వైర్‌లెస్ సెట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామానికి రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకు ఖర్చు అయినట్లు ఎస్సై తెలిపారు.

ఫ్యాక్షన్ గ్రామంలో ప్రశాంతత..

ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరు వేమవరం గ్రామం. 2017 మేలో జరిగిన జంట హత్యలతో గోరంట్ల అంజయ్య, ఏగినేని రామకోటయ్య చనిపోయారు. రెండు వర్గాలకు సంబంధించి 20 మందిపై కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అప్పటినుంచి ఏ సమయంలో ఏం జరుగుతుందోనని పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రశాంతతకు కృషి చేస్తున్నాం...

వేమవరం గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో ప్రశాతంతకు కృషితో అభివృద్ధికి బాటలు వేస్తున్నాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయంలో పనిచేస్తున్న వివిధ శాఖలు, వలంటీర్లకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇప్పించాం. శిక్షణతో విధులు బాధ్యతలపై పట్టు సాధించారు.

డీ వెంకట సుబ్బయ్య చౌదరి, సర్పంచ్, వేమవరం

అధికారుల ఆదేశాలతో కెమెరాల ఏర్పాటు..

నేరాలు, ఘోరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ, సీఐ ఆదేశాల మేరకు ఇప్పటికే దాతల సహకారంతో బల్లికురవ, చెన్నుపల్లి, ఉప్పమాగులూరు నాలుగు రోడ్ల జంక్షన్‌లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయించాం. త్వరలో కొమ్మినేని వారిపాలెం, మల్లాయపాలెంలో ఏర్పాటు చేయిస్తాం. వీటికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు.

వీ. వేమన, ఎస్సై

డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులు

యద్దనపూడి: మండలంలోని గన్నవరం ఎస్సీ కాలనీలో రూ.40 లక్షల నిధులతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అంతర్గత రహదారులతో పాటు డ్రైనేజీ నిర్మాణ పనులు కూడా ప్రాధాన్యత క్రమంలో చేపట్టి అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ధూళిపాళ్ల వేణు, సర్పంచ్ పల్లెపోగు అన్నమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్, ఉప సర్పంచ్ చెరుకూరి వేణు, ధూళిపాళ్ల హనుమంతు రావు, దేవగిరి కోటిరెడ్డి, సుబ్బారెడ్డి, ఆరె. హరిబాబు, కాకాని రోశయ్య, యోహాన్ పాల్గొన్నారు.

లారీలు ఢీ, డ్రైవర్లకు గాయాలు



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

మేదరమెట్ల: రెండు లారీలు ఢీకొట్టుకోవడంతో ఇరువురి డ్రైవర్లకు గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన లారీ డివైడర్ దిమ్మెలను గుద్దుకుంటూ మరో రోడ్డులో వెళ్తున్న లారీని ఢీకొట్టంది. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విజయవాడ వైపు నుంచి వస్తున్న లారీ పీ.గుడిపాడు జాతీయ రహదారి సమీపానికి రాగానే డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. దీంతో అదుపు తప్పిన లారీ రోడ్డు మధ్యలో డివైడర్‌గా ఉంచిన సిమెంటు దిమ్మెలను ఢీ కొట్టుకుంటూ ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్లు ఇద్దరికి గాయాలయ్యాయి. ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్థానికులు, పోలీసులు కష్టించి బయటకు తీసి చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల ఎస్సై పీ.నాగశివారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించి, కేసు నమోదు చేశారు.

శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు ఉపయోగం



చినగంజాంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న బ్రహ్మానందరెడ్డి



చీరాల: కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకర్

చినగంజాం: గ్రంథాలయ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. శాఖ గ్రంథాలయ చినగంజాం నందు సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరానికి మొత్తం 32 మంది విద్యార్థులు హాజరయ్యారు. శిబిరంలో ఇంగ్లిష్ గ్రామర్, కంప్యూటర్ శిక్షణతో పాటు చదవడం, రాయడం వంటి నైపుణ్యాలపై శిక్షణ నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. శిక్షణా శిబిరానికి రిసోర్స్ పర్సన్‌లుగా జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు, జెడ్పీ ఉన్నత ఇంగ్లీషు ఉపాధ్యాయుడు ఎస్ నరసింహరావు, వై రామాంజనేయులు, పల్లపోలు శ్రీబాబు, బీడీసీఎస్ నిర్వాహకులు అంకిరెడ్డి, నాగబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి/అద్దంకి రూరల్: వేసవి విజ్ఞాన శిబిరంతో విద్యార్థులకు ఎంతో మేలని ఎంఈవో పీవీ రాఘవరావు అన్నారు. సోమవారం అద్దంకి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 45 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, అద్దంకి లెవీ ప్రసాద్, సీహెచ్ వీరయ్య, గ్రంథపాలకుడు చుండూరు సుగుణరావు పాల్గొన్నారు. సంతమాగులూరు శాఖగ్రంథాలయంలో లైబ్రేరియన్ బాదం విజయ భాస్కర్‌రెడ్డి వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

చీరాలలో..

చీరాల అర్బన్: విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తహసీల్దార్ జి.ప్రభాకర్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రంథపాలకురాలు డి.ధనమ్మ విద్యార్థుల చేత పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించారు. ఫ్యాకల్టీ పి.హరిప్రసాద్ విద్యార్థులకు తరగతులు నిర్వహించారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



కడవకుదురులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చినగంజాం: వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కమ్యూనిటీ హాలు నందు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా వాటిలో కంటికి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. గుండె, కిడ్నీ, విషజ్వరాలు వంటి వ్యాధులకు వైద్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. డాక్టర్ రామాంజనేయులు, రాణి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: అంధత్వంతో బాధపడుతున్నవారికి సేవచేయటంలో తృప్తి, ఆనందం ఉందని ఎం కుసుమ కుమారి అన్నారు. సోమవారం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 72 మందిని పరీక్షించగా 17 మందిని శుక్లాల ఆపరేషన్ చేయించుకోవాలని టెక్నిషియన్లు శాయి నాగరాజు సూచించారు. శిబిరంలో పాఠశాల హెచ్‌ఎం ఏ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది సామ్రాజ్యం, మణికంఠ పాల్గొన్నారు.

నేడు గంగమ్మ తిరునాళ్ల

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాయపల్లిలో పాలేటి నది ఒడ్డున వెలసిన పాలేటి గంగమ్మ తిరునాళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. 3వ రోజైన సోమవారం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమపూజలు చేశారు. యాదవులకు ప్రముఖ ఉత్సవం కావడంతోభారీగా ఈ ఉత్సవానికి హాజరవుతారు.